• హరిత బయోటెక్ ప్లాంట్ పరిశీలన


ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

మానకొండూర్: మండలంలోని పర్లపల్లి హరిత బయోటెక్ ప్లాంట్ రెన్యువల్ కోసం యాజమాన్యం దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ప్లాంట్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తపల్లిలో ఏర్పాటు చేసిన వాటర్ రీస్టోర్ కేంద్రంలో పైపులైన్, నీరు, విద్యుత్ వినియోగం తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం పర్లపల్లిలోని ఫ్యాక్టరీని సందర్శించి, చేపడుతున్న పనులు, మెషీన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. తరగతి గదుల్లోని పాత ఫర్నిచర్‌ను తొలగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పీ సీఈవో ప్రియాంక, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, తహసీల్దార్ కనకయ్య, ఇరిగేషన్, పొల్యూషన్ కంట్రోల్ అధికారులు, ప్లాంట్ సిబ్బంది ఉన్నారు.

• 1 ఎల్ కాలువ నిర్మాణంపై గ్రామసభ


మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్‌లో ఉప కాలువ–9కి అనుసంధానంగా 1 ఎల్ కాలువ నిర్మాణానికి సంబంధించి బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. 105, 106 సర్వే నంబర్లలోని 38 గుంటలు భూమికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్, మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్ జగన్‌రెడ్డిలు మాట్లాడుతూ.. కాలువ కింద 200 మంది వరకు రైతులు ఉన్నారని, ఒక్క రైతు కారణంగా కాలువ నిర్మాణం చేపట్టకపోవడంతో మిగతావారికి తీవ్ర నష్టం జరుగుతోందని తెలిపారు. పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని, తాత్కాలికంగా ఇతర రైతుల భూముల నుంచి సాగునీరందించాలని కోరారు. 25వ తేదీలోగా సంబంధిత రైతుతో మాట్లాడతామని అధికారులు హామీ ఇచ్చారు. డీఈ రాములు, తహసీల్దార్ బావ్‌సింగ్, సర్పంచు కుమ్మరి సంపత్, ఏఈ మహేందర్, ఆర్‌ఐ రజినీష్ తదితరులు పాల్గొన్నారు.

• టెక్నాలజీకి అనుగుణంగా స్కిల్స్ పెంచుకోండి


మాట్లాడుతున్న టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా

హుజూరాబాద్‌రూరల్: టెక్నాలజీకి అనుగుణంగా స్కిల్స్ పెంచుకోవాలని టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా అన్నారు. బుధవారం సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ కందకూరి శంకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే పట్టుదల, కృషి ఉండాలని చెప్పారు. ప్రతీ విద్యార్థి కంప్యూటర్ సైన్స్‌లో వస్తున్న మార్పులను తెలుసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థుల్లో టాస్క్ ద్వారా మెరుగైన నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి కెప్టెన్ కె.రవీంద్రబాబు, అధ్యాపక సమన్వయకర్త పవన్‌కుమార్, సంజీవరాజు, రిజిస్ట్రార్ పి.వెంకటయ్య, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఎస్పీ నాయకుల నిరసన



హుజూరాబాద్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడంపై హుజూరాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద బీఎస్పీ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత ఎమ్మెల్యే కావడం వల్లే ఆయన అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించలేదని ఆరోపించారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని పేర్కొన్నారు. నాయకులు దొడ్డ సమ్మయ్య, ఆకెనపల్లి శిరీష, బండారి సదానందం, మేకల రవీందర్, రామ్ శ్రీను తదితరులున్నారు.

హద్దురాళ్ల తొలగింపు

శంకరపట్నం: కేశవపట్నం ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ప్లాట్ల కోసం హద్దురాళ్లు ఏర్పాటు చేయగా రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. అనుమతి లేకుండా ప్లాట్లు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఓ వ్యక్తి వద్ద ప్లాట్లు కొనుగోలు చేశామని పలువురు తహసీల్దార్ ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. అనుమతి, రిజిస్ట్రేషన్ లేకుండా ఏర్పాటు చేసిన హద్దురాళ్లను తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు.

సామూహిక సీమంతం



మానకొండూర్: మండలంలోని పోలంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో 25 మంది గర్భిణులకు బుధవారం సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ ప్రియాంకస్వామి ఆర్థికసాయం అందించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ కేతిరెడ్డి వనిత, కరీంనగర్ డీడబ్ల్యూవో సబిత హాజరయ్యారు. తల్లీబిడ్డల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. సర్పంచు బొజ్జ తిరుపతి, ఎంపీటీసీ సభ్యుడు రమేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, ఏఎన్‌ఎం తిరుమల తదితరులున్నారు.

కాలినడకన కాశీ యాత్రకు భక్తులు



చొప్పదండి: కాశీ యాత్రకు పలువురు భక్తులు బుధవారం బయలుదేరి వెళ్లారు. చొప్పదండి పట్టణానికి చెందిన దండె రవీందర్, కాటం ఇంద్రసేనా రెడ్డి, తొడుపునూరి రాములు, ఐనసలేని బాలరాజు, నాగమల్ల లచ్చయ్యలు కాశీ యాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. భజన బృందం సభ్యులు వారి వెంట కొద్ది దూరం భజనలు చేస్తూ సాగనంపారు.

చెట్ల తొలగింపునకు సహకరించాలి

చొప్పదండి: పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు చేపడుతున్నందున నిబంధనల మేరకు చెట్లను తొలగించేందుకు అటవీ శాఖ ద్వారా అనుమతి తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. బుధవారం చెట్ల తొలగింపు పనులను పరిశీలించారు.

నేటి నుంచి దేశరాజ్‌పల్లి రోడ్డు మూసివేత

రామడుగు: దేశరాజ్‌పల్లి గ్రామానికి వెళ్లే రహదారిలోని 25/ఇ కిలోమీటర్ వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతు చేపడుతున్నట్లు తహసీల్దార్ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి మార్చి 4వ తేదీ వరకు రోడ్డు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నూతన నియామకం

రామడుగు: తెలంగాణ అంబేడ్కర్ సంఘం చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడిగా జెట్టిపల్లి అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంటి శ్రీనివాస్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చిన్న జీపీలకు ఆర్థిక ఇబ్బందులు

- గ్రామాల్లో పందులు, కుక్కలు, కోతుల బెడద
- ప్రభుత్వ వైద్యశాలల్లో సమయపాలన పాటించని వైద్యులు
- సమస్యలపై గంగాధర మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల మొర



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ శ్రీరాం మధుకర్, అధికారులు

గంగాధర: గ్రామాల్లో సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ్య సమావేశంలో మొర పెట్టుకున్నారు. గంగాధర మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీరాం మధుకర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. రైతు వేదికలు నిర్వహణ లేక దుమ్ముపట్టి పోతున్నాయని అన్నారు. కొత్తగా పట్టాదారు పాసుబుక్కులు వచ్చినవారికి రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమకావడం లేదని పేర్కొన్నారు. గ్రామాల్లో దోమలు, పందుల బెడదతోపాటు కోతులు, కుక్కల సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ఫాగింగ్ మెషీన్లు కొనుగోలు చేయడానికి, ఇతర అవసరాలకు చిన్న గ్రామ పంచాయతీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో డాక్టర్లు ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదని, కురిక్యాల పల్లె దవాఖానాకు డాక్టర్ లేడని తెలిపారు. 104 సేవలు బంద్ కావడంతో బీపీ, షుగర్ బాధితులు ఇబ్బంది పడుతున్నారని, వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎల్లంపల్లి నీటిని నారాయణపూర్ చెరువుకు పంపింగ్ చేసి, పంటలకు సాగు నీరందించాలన్నారు. లేనిపక్షంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులే రోడ్డెక్కే పరిస్థితి వస్తుందని తేల్చిచెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారని, సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతోందన్నారు. అనంతరం ఎంపీపీ శ్రీరాం మధుకర్ మాట్లాడుతూ.. సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకుందామని అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కంకణాల రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో భాస్కర్‌రావు, సహకార సంఘం చైర్మన్ తిరుమల్‌రావు, రైతుబంధు సమితి అధ్యక్షుడు పుల్కం గంగన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య పాల్గొన్నారు.

ఇంటి పన్ను తగ్గించాలి


సమావేశమైన అధికారులు, ప్రజలు

చొప్పదండి: పట్టణంలో ఇబ్బడిముబ్బడిగా పెంచిన ఇంటి పన్నును వెంటనే తగ్గించాలని చొప్పదండిలోని పన్నుల తగ్గింపు ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ శాంతి కుమార్‌లతో పట్టణ ప్రజలు సమావేశమయ్యారు. ప్రస్తుతం రూపాయిగా నమోదు చేసిన ఇంటి పన్నును 30 పైసలకు తగ్గించాలన్నారు. వాణిజ్య సముదాయాలకు ఏరియాను బట్టి కాకుండా నిర్మాణాల మేరకు పన్ను విధించాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పన్నులు తగ్గించేందుకు కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పన్నులను పట్టణ ప్రజలు సకాలంలో చెల్లించాలని, రెండు శాతం వడ్డీని మినహాయింపు పొందాలని సూచించారు. కార్యక్రమంలో కొట్టె అశోక్, మాదూరి శ్రీనివాస్, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, ఇప్పనపల్లి సాంబయ్య, గుర్రం ఇంద్రసేనారెడ్డి, గుర్రం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్


ట్రాక్టర్లను చూపుతున్న పోలీసులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను చిగురుమామిడి పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి గ్రామం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్సై దాస సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శ్రీనివాస్, దేవయ్యలు దాడి చేశారు. ట్రాక్టర్లను సీజ్ చేసి, వాటి యజమానులు శ్రీనివాస్, సంతోష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మండలంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించాలి

- చొప్పదండి పాలకవర్గ ఏకగ్రీవ తీర్మానం


పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

చొప్పదండి: రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చొప్పదండి వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని పదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ పాలకవర్గ సభ్యులు బుధవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించారు. మార్కెట్ యార్డులోని పాత కార్యాలయం శిథిలావస్థకు చేరినందున కూల్చివేయాలని నిర్ణయించారు. యార్డులోని రెండెకరాల స్థలాన్ని ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌కు అప్పగించినందున అదనంగా స్థలం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మార్కెట్ కమిటీ పాలకవర్గంలో సభ్యుడైన చొప్పదండి పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి జాతీయ స్థాయిలో ఉత్తమ పీఏసీఎస్ అవార్డును మూడుసార్లు అందుకొని, చొప్పదండి కీర్తిని దేశవ్యాప్తంగా చాటారన్నారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, మార్కెట్ కార్యదర్శి మల్లేశం, ఎం.శ్రవణ్‌కుమార్, డైరెక్టర్లు ఆనందం, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాహస కృత్యాల పోటీల్లో ప్రతిభ


ధ్రువపత్రాలు అందించిన డీఈవో జనార్దన్‌రావు

చిగురుమామిడి: హరియాణాలోని జాతీయ అడ్వెంచర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 5 రోజులపాటు జాతీయ సాహస కృత్యాల పోటీలు నిర్వహించారు. 10 కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్, కులంబో బ్రిడ్జి క్రాసింగ్, టైర్ కాలింగ్ తదితర అంశాల్లో రామంచ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 7, 8వ తరగతుల విద్యార్థులు విష్ణువర్ధన్‌రెడ్డి, రిషిత్ రెడ్డి, రామ్‌రెడ్డి, చరణ్ తేజ్, విష్ణు, మణిదీప్‌లు ప్రతిభ కనబరిచినట్లు స్కౌట్ మాస్టర్ షరఫ్ అహ్మద్ తెలిపారు. వీరికి డీఈవో సీహెచ్.జనార్దన్‌రావు బుధవారం తన కార్యాలయంలో ధ్రువపత్రాలు అందించి, అభినందించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కంకణాల రామ్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్.విజయలక్ష్మి, సర్పంచు గుంటి మాధవి తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం మన దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీఆర్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ హుస్సేన్ పూలమాల వేసి, నివాళి అర్పించారు. దేశానికి, విద్యారంగ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, బీఆర్‌ఎస్ వార్డుల అధ్యక్షులు గంట మధుకర్, ఉప్పు శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌చార్జి తులసి లక్ష్మణమూర్తి, నాయకులు సర్వర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోండి

జమ్మికుంట: కేంద్రం రైల్వే ప్రైవేటీకరణ ఆలోచన చేస్తోందని, దాన్ని వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం జమ్మికుంట రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు. రైల్వే సంస్థలో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులు, వర్కర్లకు కార్మిక చట్టాలను అనుసరించి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, గూడ్స్ షెడ్ పార్సిల్ హమాలీలకు మంచినీరు, రెస్ట్ రూమ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, విజేందర్, స్వామి తదితరులున్నారు.

తపాలా మేళా విజయవంతం చేయండి

రామడుగు: తపాలా కార్యాలయాల్లో నిర్వహిస్తున్న తపాలా మేళా కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని రామడుగు ఎస్పీఎం అజ్మత్ అలీ కోరారు. రామడుగులో బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. సిబ్బంది మల్లేశం, సుధాకర్, శ్రీనివాస్, అజయ్, సంతోష్, అశ్విన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై దృష్టిసారించాలి

చొప్పదండి: గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై దృష్టిసారించాలని ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. చొప్పదండి మండల పరిషత్‌లో మూడు రోజుల పారిశుధ్య అవగాహన సమావేశాల ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో సర్వే జరిపి, పారిశుధ్య ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రశంసాపత్రాలు అందించారు. ఎంపీడీవో స్వరూప, ఎంపీవో రాజగోపాల్, ఏపీఎం నర్మద, ఏపీవో రాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తడి, పొడి సాగుపై అవగాహన

జమ్మికుంట: మడిపల్లిలో పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు తడి, పొడి వరి సాగుపై బుధవారం అవగాహన కల్పించారు. క్లస్టర్ కో–ఆర్డినేటర్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. తడి, పొడి వరి సాగు విధానంలో వాతావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. వరి పొలంలో చీడపీడల ఉధృతి తగ్గి, దిగుబడి పెరుగుతుందని తెలిపారు. సర్పంచు పర్శ రాములు, ఏఈవో రాంప్రసాద్, కో–ఆర్డినేటర్ దేవరావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించండి


వెంకట్రావుపల్లిలో జీవాలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న ఎంపీపీ కవిత

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, గొర్రెల కాపరులు గొర్రెల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీపీ దొడ్డె మమత అన్నారు. బుధవారం జగ్గయ్యపల్లి గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. జీవాలకు సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మొత్తం 2,110 జీవాలకు నట్టల నివారణ మందు తాగించినట్లు తెలిపారు. సర్పంచులు ఇల్లందుల అన్నపూర్ణ, కనపర్తి వంశీధర్‌రావు, పశువైద్యాధికారి ప్లవన్ మజుందార్ పాల్గొన్నారు.

రామడుగు: జీవాలకు నట్టల నివారణ మందు తాగించాలని ఎంపీపీ కలిగేటి కవిత అన్నారు. రామడుగు మండలంలోని వెంకట్రావుపల్లిలో బుధవారం పశువులకు నట్టల నివారణ మందు తాగించారు. 6,865 గొర్రెలకు మందు తాగించినట్లు మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, సర్పంచు జవ్వాజీ శేఖర్, ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులున్నారు.

శంకరపట్నం: మండలంలోని గొల్లపల్లి, అంబాల్‌పూర్ గ్రామాల్లో బుధవారం పశువైద్యాకారులు భాగ్యలక్ష్మి, మాధవరావులు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, సర్పంచు రజిత, పశువైద్య సిబ్బంది, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామి ఆలయంలో పూజలు

చొప్పదండి: కొండగట్టు దేవస్థానానికి రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు చొప్పదండి నియోజకవర్గంలోని హనుమాన్ దేవాలయాల్లో కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బుధవారం చొప్పదండి పట్టణంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో రెండోవార్డు కౌన్సిలర్ మాదూరి శ్రీనివాస్ 101 కొబ్బరికాయలను కొట్టి, పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, నాయకులు బందారపు అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కళ్లద్దాలు అందిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు, చైర్‌పర్సన్ రాధిక, అధికారులు

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధి 28వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్న పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కాల్వల దీప్తి, వైద్యాధికారి సంధ్యారాణి, సూపర్‌వైజర్ రత్నకుమారి, ఆప్టోమెట్రిస్ట్ అమరేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు..

గన్నేరువరం: జంగపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ అటికం శారద, ఎంపీటీసీ సభ్యుడు అటికం రాజేశంగౌడ్‌లు బుధవారం ప్రారంభించారు. గ్రామంలో 160 మందికి కంటి పరీక్షలు చేసినట్లు వైద్యుడు సందీప్‌రెడ్డి తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

హుజూరాబాద్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని 30వ వార్డులో శిబిరాన్ని ప్రారంభించారు. పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు తోట రాజేంద్రప్రసాద్, ముక్క రమేశ్, పాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గేదెల లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభ

రామడుగు: లక్ష్మీపూర్‌లో పాడి గేదెల లబ్ధిదారుల ఎంపికకు బుధవారం సర్పంచ్ చిలుముల రజిత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర మాట్లాడుతూ.. లక్ష్మీపూర్‌కు 11 యూనిట్లు మంజూరయ్యాయని, రూ.2 లక్షల సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. రూ.1.50 లక్షల లోపు వార్షిక ఆదాయంతోపాటు 20 గుంటల వ్యవసాయ భూమి ఉండాలన్నారు. ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి అనిల్‌రెడ్డి, జీపీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులున్నారు.

రెండో విడత 'దళిత బంధు' ఇవ్వాలి

జమ్మికుంట: లబ్ధిదారులకు రెండో విడత దళిత బంధు పథకం డబ్బులు ఇవ్వాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జమ్మికుంట మండల అధ్యక్షుడు రాచపల్లి సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జమ్మికుంటలో ఆయన మాట్లాడారు. మినీ డెయిరీలు, రిటైల్ షాపులు ఎంపిక చేసుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం 50 శాతం డబ్బులు మాత్రమే ఇచ్చిందన్నారు. అవి సరిపోక వ్యాపార నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లా కార్యదర్శి సలిగంటి సతీశ్, ఇల్లందకుంట మండల అధ్యక్షుడు మడిపల్లి చక్రపాణి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


రామడుగు: వెదిరకు చెందిన ఎముండ్ల కనకయ్య కుటుంబానికి ఆధార్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ బుధవారం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కనకయ్య కొన్నిరోజుల క్రితం ప్రమాదానికి గురై, చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో ఆయన కూతురు అక్షిత అనారోగ్యంతో మృతి చెందింది. ఆ కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉండటంతో ఆర్థికసాయం చేశారు. వార్డు సభ్యుడు లక్ష్మణ్, అరుణోదయ సాంస్కృతిక కళాకారుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూ దాతలకు సన్మానం


సత్కరిస్తున్న జయపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది

గంగాధర: లక్ష్మీదేవిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి తమ తండ్రి జ్ఞాపకార్థం గ్రామానికే చెందిన ఎల్కపల్లి రాజగోపాల్ రెడ్డి, జనార్దన్‌రెడ్డిలు 2 గుంటల స్థలం ఇచ్చారు. వారిని బుధవారం మైత్రి గ్రూప్ చైర్మన్ జయపాల్‌రెడ్డి సన్మానించారు. సర్పంచు విజయ, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల వన సందర్శన



సైదాపూర్: వెన్కెపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు హుజూరాబాద్ అటవీశాఖ అధికారులు బుధవారం వన సందర్శన కార్యక్రమం నిర్వహించారు. సైదాపూర్ మండలంలోని రాయికల్ అటవీ ప్రాంతం వద్దకు తీసుకెళ్లి, పచ్చదనం, అటవీ ప్రాముఖ్యతను వివరించారు. గుట్టల నుంచి వచ్చే వర్షపు నీరు వృథా పోకుండా కాంటూర్ కందకాలు తవ్వించడం, నీటి నిల్వకు చెక్ డ్యాంల నిర్మాణం, అటవీ ప్రాంతంలో ఔషధ, పండ్ల మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు ఖైరున్నీసాబేగం, అటవీ శాఖ అధికారులు రాజేశ్వర్‌రావు, జలీలొద్దీన్, సురేష్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్ ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899